## క్లుప్తంగా

### పౌష్టికాహారంతో ఆరోగ్యం



వెంకటాపురం(కె): పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటామని జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బాలింతలకు, చిన్నారులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పుష్పవతి చంద్రకళ తదితరులు ఉన్నారు.

### పంచాయతీ నిధులు దుర్వినియోగం

మంగపేట: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు లేకపోడంతో అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు నిధులను దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు లోడె శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పంచాయతీల అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను పంచుకుంటున్నారని వాపోయారు. గ్రామ పంచాయతీలలో గ్రామసభల తీర్మానం లేకుండా జీపీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టే పనులను బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పంచుకుని నాసిరకంగా పనులు చేస్తు నిధులను దండుకుంటున్నారని విమర్శించారు. సంబంధిత అధికారులు సైతం ఆయా పార్టీల నాయకులకు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని ఆరోపించారు.

### ఆలయం వద్ద నీటి ఎద్దడి

ములుగు రూరల్: మండలంలోని ఇంచర్ల శివారు రామస్వామి గుట్ట వద్ద గల హనమాన్ ఆలయం వద్ద నీటి ఎద్దడి నెలకొంది. దీంతో హనుమాన్ మాలధారణ భక్తులు ఆలయం వద్ద పూజలు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు గురువారం హనుమాన్ భక్తులు పని చేయని చేతిపంపు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కంచె రాజు మాట్లాడుతూ.. ఆలయం వద్ద నీరు లేక హనుమాన్ దీక్ష భక్తులు ఇబ్బదులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై సర్పంచ్‌కు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి ఆలయం వద్ద నీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు చేయాలని హనుమాన్ భక్తులు కోరుతున్నారు.

### అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



పలిమెల: అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దని పలిమెల ఎస్సై–2 శివకుమార్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా గురువారం మండలంలోని బొడాయిగూడెంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై శివకుమార్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడే మావోయిస్టులకు సహకరించడం లేదా ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని ఇందుకు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మావోయిస్టుల గురించి ఎటువంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ఎండా కాలం నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పనులకు వెళ్లే వారు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీఎస్ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపయోగంగా 'క్వార్టర్'

- వ్యర్థాలతో నిండుతున్న ఖాళీ స్థలం
- వ్యాప్తి చెందుతున్న దోమలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



శిథిలమై నిరుపయోగంగా ఉన్న అటవీశాఖ క్వార్టర్

ఏటూరునాగారం: మండల, గ్రామ, అటవీ రక్షణ కోసం పూర్వకాలంలో చౌకీదార్ అనే పిలుబడే (ప్రస్తుతం) బీట్ అధికారి ప్రభుత్వ క్వార్టర్ నిరుపయోగంగా మారింది. మండల కేంద్రంలోని 5వ వార్డులో గ్రామంలో ఉంటే గ్రామరక్షణ, అటవీ రక్షణ, కలప అక్రమ రవాణా నివారణకు ఉంటుందని గతంలో బీట్ ఆఫీసర్ నివాసం ఉండేందుకు క్వార్టర్‌ను నిర్మించారు. అప్పటి పీపుల్స్‌వార్ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఎఫ్‌ఆర్‌ఓ కార్యాలయాన్ని పేల్చివేయడంతో కాలక్రమేణ అటవీశాఖ రేంజ్, బీట్, ఎఫ్‌డీఓ కార్యాలయాలు క్రాస్‌రోడ్డుకు తరలివెళ్లాయి. దీంతో గ్రామంలో ఉన్న చౌకీదార్ క్వార్టర్ శిథిలమైంది. గత ఏడాది వర్షాకాలంలో పల్లెప్రగతిలో భాగంగా శిథిలమైన గృహాలను కూల్చివేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో అప్పటి గ్రామ పంచాయతీ కార్యదర్శి చందూలాల్ దానిని కూల్చివేయించారు. దీంతో గృహం పూర్తిగా శిథిలమై వ్యర్థాలకు అడ్డగా మారింది. గృహం ఆవరణంలో ఇరుగు పొరుగు వారంతా కూడా చెత్తాచెదారం అందులో వేయడంతో దోమలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. విష కీటకాలు, పాములు కూడా సంచరిస్తున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు దానికి వినియోగించుకొని నూతనంగా అతిథి గృహం లేదా స్టాఫ్ క్వార్టర్స్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఎంతో విలువైన భూమిని అటవీశాఖ కార్యాలయం అవసరాల నిమిత్తం వినియోగించుకోవాలని కోరుతున్నారు.



వ్యర్థాలతో నిండిన ఖాళీ ప్రదేశం

#### నూతన భవనం నిర్మించాలి



బీట్ ఆఫీసర్ కోసం నిర్మించిన పూర్వపు గృహం కూలిపోయింది. దీంతో దోమలకు నిలయంగా మారింది. అలాగే విషపు కీటకాలు, పాములు సంచరిస్తున్నాయి. నూతన భవనం నిర్మించి ప్రజలకు కలిగే ఇబ్బందులు తొలగించాలి.

– లక్ష్మీనారాయణ, ఏటూరునాగారం

#### కోతులతో ఇబ్బంది



శిథిలమై ఉండడంతో అందులోనే కోతులు నివాసం ఉంటున్నాయి. దీనివల్ల ఇళ్లలోకి వచ్చి ఏ సామగ్రిని వదలకుండా ఎత్తుకెళ్తున్నాయి. అన్నం గిన్నెలు, ఇలా తినే సామాను మొత్తం పోతుంది. ఇక్కడ ఏదైనా కొత్తగా నిర్మించి కోతులతో ప్రజలకు కలిగే ఇబ్బందులు లేకుండా చూడాలి

– గడ్డం లక్ష్మి, ఏటూరునాగారం గృహిణి

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న రాంబాబు

ములుగు రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్ లైన్ మెంబర్ జనగాం రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని కన్నాయిగూడెం, రాంనగర్‌తండా, కాశిందేవిపేట గ్రామాలలో ఉపాధిహామీ పని ప్రదేశాల్లో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా గ్రామ కమిటీలు చర్యలు తీసుకోవాలని అన్నారు. చిన్నారులు వేధింపులకు గురైతే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని అన్నారు. బాల్య వివాహాల చట్టం 2006 ప్రకారం 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే వివాహం చేయాలని అన్నారు. మహిళలు గృహహింస, వేధింపులకు గురయినట్లయితే సఖి కేంద్రం అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ సాధన, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు

కాటారం: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు కలుగుతుందని ఉద్యానవన శాఖ అధికారి రమేశ్ అన్నారు. మండలంలోని చింతకాని రైతువేదికలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యత, విశిష్టత, యాజమాన్య పద్ధతులు, ఉద్యానవన శాఖ అందించే రాయితీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేపట్టడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందన్నారు. అన్ని రకాల పంటలతో పోలుస్తే ఆయిల్‌పామ్ పంట రైతులకు అనేక ప్రయోజనాలను చేకూర్చుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమకు దగ్గర్లో ఉన్న వ్యవసాయ అధికారులు, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులను, ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఓ రామకృష్ణ, ఎంపీటీసీ ఉడుముల విజయారెడ్డి, ఉప సర్పంచ్ సంతోష్, ఏఈఓ దివ్య, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, కంపెనీ ప్రతినిధులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుర్రంకృష్ణప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మండలంలోని గిద్దెముత్తారం గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అందుకుతండా గ్రామానికి చెందిన ఓనర్, డ్రైవర్ అన్నవేణి కిరన్, అన్నవేణి సమ్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏఎస్సై ఈశ్వరయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# గొర్రెల పంపిణీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నవత

ములుగు/ములుగు రూరల్: తెలంగాణ ప్రభుత్వం గొల్ల కురుమలకు ప్రతిష్టాత్మకంగా చేపటిన రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై అవగాహన కార్యకరమాన్ని జిల్లా కేంద్రంలో పశువైద్య శాఖ అధికారి వనిత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు వారికి సంబంధిచిన వాటా ఆన్‌లైన్ చెల్లింకాల్సి రూ.43,750, కుల ధృవీకణపత్రం, నామిని ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్కు జిరాక్స్ పత్రాలను తక్షణమే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బైకానిసాగర్, బాషబోయిన మాలగాం, బత్తిని ఐలయ్య, బైకాని నటరాజ్, బోయిని రాజు, మదం ఉమమహేశ్వరరావు, పేబోయిన శ్రీధర్, రమేష్, మల్లేష్, సమ్మయ్య, రంజిత్ తదితరులు ఉన్నారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై తిరుపతిరావు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక గ్రామ సమీపంలో ఎస్సై తిరుపతి రావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు గురువారం ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్ల మండలం, వాజేడు మండలాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి రావు మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించిన పేపర్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. ఈ తనిఖీల్లో సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

#### లైసెన్స్ తప్పనిసరి



కన్నాయిగూడెం: తనిఖీ చేస్తున్న ఎస్సై సురేష్

కన్నాయిగూడెం: వాహనదారులు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్సై సురేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చిట్యాల క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. తుపాకులగూడెం, పలిమెల, మహారాష్ట్ర, ఏటూరునాగారం ప్రాంతాల నుంచి వచ్చి పోయే వాహనాలను ఆపి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఏటూరునాగారం: దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు



కన్నాయిగూడెం: మిర్చిని పరిశీలిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: కురుస్తున్న అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దావూద్ అన్నారు. గురువారం మండలంలోని శివాపురం, గోగుపల్లి, పెద్ద వెంకటాపురం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే చేతికి వచ్చే సమయంలో నీట మునగడం, రాలిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిల్లో ఉన్నారని అన్నారు. శివపురానికి చెందిన కన్నెబోయిన సాంబరాజు, పెద్ద వెంకటాపురానికి చెందిన బైరెడ్డి మల్లారెడ్డి వరి మొత్తం నేలవాలిందన్నారు. అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కన్నెబోయిన సాంబరాజు, బైరబోయిన విష్ణు, మోకాల రంజిత్, ఎస్కే అల్లావుద్దీన్, కోరం ప్రసాద్, వంక బాబురావు, నక్కల మధు, వంక పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ.అప్సర్, జెడ్పీటీసీ చందు అన్నారు. మండలంలో దెబ్బతిన్న పంటలను గురువారం వారు పరిశీలించి మాట్లాడారు. కోతకు వచ్చిన పంటలు అకాల వర్షాలతో పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసిపోయిందన్నారు. అధికారులతో సర్వే చేసి ఎకరాకు రూ.50 వేల నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాంబాబు, చింతగూడెం ఉప సర్పంచ్ జంగ కృష్ణ, శింగారం ఉప సర్పంచ్‌గడ్డం నాగేష్, ప్రభాకర్, సాంబశివ పాల్గొన్నారు.

### నేడు అవగాహన సదస్సు

వెంకటాపురం(ఎం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంఈజీపీ పథకంపై నేడు(శుక్రవారం) అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ పథకానికి 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని తెలిపారు. తయారీ రంగ పరి శ్రమలకు రూ.50 లక్షల లోపు, సేవా రూ.20 లక్షల లోపు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులు, మహిళలకు 5 శాతం, జనరల్ అభ్యర్థులు 10 శాతం తొలుత పెట్టుబడి వ్యయంగా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో జనరల్ అభ్యర్థులకు 25 శాతం, పట్టణ ప్రాంతాల్లో 15 శాతం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళల అభ్యర్థులకు గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం, పట్టణ ప్రాంతాల్లో 25 శాతం రాయితీలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. రుణాన్ని 3 నుంచి 7 ఏళ్ల లోపు లబ్ధిదారుడు చెల్లించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ, కేవీఐసీ, కేవీఐబీ అధికారులు సంయుక్తంగా పీఎంఈజీపీ పథకంపై విస్తత ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. అవగాహన సదస్సుకు నిరుద్యోగులు హాజరు కావాలని కోరారు.

### వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వెంకటాపురం(ఎం): మండలంలోని రామానుజపురం గ్రామ సమీపంలో మే 5న నిర్వహించే ఎరుకల నాంచారమ్మ జాతర వాల్ పోస్టర్‌ను తహసీల్దార్ మంజుల గురువారం ఆవిష్కరించారు. భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అదేవిధంగా సర్పంచ్ తుమ్మేటి రాజిరెడ్డి జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో తెలంగాణ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి భిక్షపతి, ప్రధాన కార్యదర్శి పల్లకొండ భాస్కర్ తదితరులు ఉన్నారు.

# విద్యుదాఘాతంతో ఆరు పశువులు మృతి



మృతి చెందిన పశువులు

వాజేడు: విద్యుదాఘాతంతో ఆరు పశువులు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ సమీపంలో ఉన్న పొలాల్లో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామానికి చెందిన పోతురాజు, రామయ్య, తిరుపతి అనే ముగ్గురు రైతుల పశువులు మేత కోసం పొలాలల్లోకి వెళ్లారు. కాగా, పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడి ఉంటడంతో ఆరు పశువులు వాటికి తాకి షాక్ గురై మృతి చెందాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తోటి పశువులు మృతి చెందడంతో వాటితో రోజు కలిసి తిరిగే ఎద్దు వాటి చుట్టు తిరగడం అక్కడ ఉన్న రైతులను కలిసివేసింది. మృతి చెందిన పశువుల విలువ సుమారుగా రూ.3 లక్షల పైనే ఉంటుందని రైతులు తెలుపుతున్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలికితీత



మృతదేహం కోసం తవ్వుతున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని గోదావరి ఇసుక పాయలో పాతి పెట్టిన గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు వెలికితీసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరి ఇసుక పాయలో గుర్తు తెలియని మృతదేహాన్ని పాతి పెట్టారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. గోదావరి ఇసుక పాయలో పాతిపెట్టిన చోట తవ్వించి మృతదేహాన్ని వెలికి తీసినట్లు తెలిపారు. కాగా మృతదేహంపై నల్లటి పాయంటు, నీలం రంగు చొక్కా ఉందని వయస్సు సూమారు 60 సంవత్సరాలు ఉంటుదని తెలిపారు. గుర్తు తెలియని మృతదేహం గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బాధిత కుటుంబాలకు భరోసా



ఏటూరునాగారం: సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు



రామకృష్ణకు సాయం అందజేస్తున్న నాయకులు



మంగపేట: నగదు అందజేస్తున్న స్నేహితులు

ఏటూరునాగారం: వాజేడు మండలం శ్రీరామ్‌నగర్‌కు చెందిన తాటి మహేందర్ ఇటీవల కూలర్లలో నీరు పోస్తూ విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ అసిసోయేషన్ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలను గురువారం అందజేశారు. దాతలు ఇచ్చిన రూ.23వేల 500ల రూపాయల నగదును జవాన్ భార్య అశ్వినికి అందజేసి ధైర్యం చెప్పారు. ఖాజాపాషా, కయ్యూమ్, గయాస్, నారా ప్రశాంత్, సందీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

#### కాంగ్రెస్ నాయకుల చేయూత

మండల కేంద్రానికి చెందిన బొగ్గుల రామకృష్ణకు ఇటీవల తునిక పండ్ల కోసం వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. వైద్య ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ నుంచి రూ.6వేల నగదును బాధితుడికి గురువారం అందజేశారు. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు అందజేసినట్లు పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పైడకుల అశోక్, పీఏసీఎస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, జిల్లా మైనార్టీ సీనియర్ నాయకులు ఖలీల్ ఖాన్, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, మండల ఉపాధ్యక్షుడు రియాజ్, అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, ఎంపీటీసీ గుడ్ల శ్రీలత దేవేందర్, ఉప సర్పంచ్ కర్ల అరుణ, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, టౌన్ అధ్యక్షుడు సులేమాన్, వర్కింగ్ టౌన్ అధ్యక్షుడు సరికొప్పుల శ్రీనివాస్, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు సర్వ అక్షత్, జిల్లా యూత్ కార్యదర్శి ఎండీ గౌస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మధుబాబు పాల్గొన్నారు.

#### ఉపాధ్యాయుడి సాయం

మండల కేంద్రానికి చెందిన బొగ్గుల రామకృష్ణ ఇటీవల చెట్టుమీద నుంచి పడి కాళ్లు, చేతులు విరిగిపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ గురువారం బాధితుడి తల్లికి రూ.4వేలు ఆర్థిక సాయం అందజేశారు. దాతలు తమవంతుగా బాధితుడికి సాయం చేసి అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జెల సాంబయ్య, బండపల్లి సంతోష్ ఉన్నారు.

మంగపేట: మండల పరిధిలోని పొదుమూరు గ్రామానికి చెందిన సాయిని గణేష్ ఇటీవల వడదెబ్బతో మృతి చెందాడు. దీంతో బాధిత కటుంబాన్ని మృతుడితో కలిసి 2001–02లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు గురువారం పరామర్శించి రూ.85,000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. నగదును మృతుడి కుమార్తె పేరిట బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేయించారు. ఈ కార్యక్రమంలో మృతుని స్నేహితులు అక్కపెలి రాజేష్, ద్రోణాచారి, కిర్మాణ్‌పాష, నాగేంద్రబాబు, చిప్ప లక్ష్మీనారాయణ, రేణుక, మానస, ఉమాదేవి, ఖాజా, మాదాసి సంతోష్, నాగేంద్రబాబు, మర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: మండలంలోని చింతగూడెంలో ఆలెం బుచ్చయ్య అనే రైతు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు అప్సర్ పాషా, యూత్ నాయకుడు దుర్గం ప్రభాకర్ కార్యకర్తలతో కలిసి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సునార్కని రాంబాబు, సాంబశివరావు, బైరేష్, తదితరులు పాల్గొన్నారు.